క్లుప్తంగా

ఘనంగా సంతోషి మాత, సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ



వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల

కాకినాడ రూరల్: రమణయ్యపేట గోకుల్ గార్డెన్‌లో సంతోషి మాత, సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 7.51 గంటలకు విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, స్థానికులు, రమణయ్యపేటకు చెందిన భక్తులు, అమ్మవారు, సాయిబాబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపన

మండలంలోని పి.వెంకటాపురం గ్రామ పరిధిలో పండూరు జంక్షన్ వద్ద శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత ఐశ్వర్య వెంకటేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపనలో ఎమ్మెల్యే కన్నబాబు పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ అనుసూరి తాతబ్బాయి దంపతులు ఆలయ నిర్మాణానికి ప్రత్యేక పూజలు, శంకుస్థాపన నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి అన్ని విధాలా సహకరిస్తామని ఎమ్మెల్యే అన్నారు.

ఏడాదిలోగా శాశ్వత ప్రాజెక్టులు పూర్తి చేయాలి



పాల్‌హారీస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రోటరీ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీక్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో చేపట్టబోయే శాశ్వత ప్రాజెక్టులు వచ్చే ఏడాదిలోగా పూర్తి చేసేలా సభ్యులు కృషి చేయాలని రోటరీ మాజీ గవర్నర్ ఎల్.సత్యనారాయణన్ కోరారు. స్థానిక రోటరీహాల్‌లో శుక్రవారం క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ వ్యవస్థాపకులు పాల్ హారీస్ జయంతి నిర్వహించారు. ప్రజా విద్యాలయం విద్యార్థుల కోసం లైబ్రరీకి బీరువాను, చేయూత హోమ్ చిన్నారులకు టాయిలెట్ కిట్‌లను రోటరీ క్లబ్ కాకినాడ అధ్యక్షురాలు సురభి శారద, కార్యదర్శి ప్రకాశరావు బహూకరించారు. ఈ సందర్భంగా ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించి 200 మందికి దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. క్లబ్ మాజీ గవర్నర్లు కేవీఎస్ ఆంజనేయమూర్తి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దేవులపల్లికి ఘన నివాళి

కాకినాడ రూరల్: కవి దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి వర్ధంతి సందర్భంగా రమణయ్యపేట బోట్‌క్లబ్ ఉద్యానవనం వద్ద శుక్రవారం ఆయన విగ్రహానికి వాకర్స్ సంఘం నివాళులర్పించింది. గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలోని చంద్రంపాలెం గ్రామంలో జన్మించిన దేవులపల్లి బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. 1980 ఫిబ్రవరి 24న ఆయన కాలం చేశారన్నారు. వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

కాకినాడ రూరల్: బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లో శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ అడ్డాల సత్యనారాయణ ఈ వ్యాధిపై అవగాహన కల్పించారు. అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల పంపిణీ

కాకినాడ రూరల్: లయన్స్ క్లబ్ కాకినాడ ప్రొఫెషనల్ ఆధ్వర్యంలో శుక్రవారం సర్పవరం జంక్షన్‌లో కోడిగుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ద్వారంపూడి విపుల్ అవినాష్ రెడ్డి, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, అడబాల వెంకటేశ్వరరావు, రేలంగి బాపిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పద్మశ్రీకి అభినందన

కాకినాడ సిటీ: ఎమ్మెల్సీగా ఎన్నికైన కర్రి పద్మశ్రీని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా కమిటీ అభినందించింది. శుక్రవారం ఎన్‌సీసీ కాకినాడ జిల్లా రీజనల్ చైర్మన్ మోసా అబ్రహం, జిల్లా కార్యదర్శి ఎం.ఇస్సాకు, ఎం.ఆశీర్వాదం, ఎన్‌సీసీ కాకినాడ జిల్లా బృందం ఎమ్మెల్సీ పద్మశ్రీని కలిసి అభినందించారు. అలాగే ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

యోగాతో మానసిక ప్రశాంతత

బోట్‌క్లబ్: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జేఎన్‌టియూకే ప్రొఫెసర్, యోగా టీచర్ కె.సుధాదేవి అన్నారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ, రామచంద్రమిషన్ ఆధ్వర్యంలో స్థానిక అశోక్‌నగర్ శాంతి ఆశ్రమంలో మూడు రోజుల పాటు నిర్వహించే యోగా శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ప్రాణాయామం, ముద్రలు, హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానం తదితర ప్రక్రియలు నేర్పనున్నట్లు తెలిపారు.

రామోజీ తప్పుడు రాతలకు కాలం చెల్లింది

- మండిపడ్డ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి
- రామోజీరావు దిష్టిబొమ్మ దహనం
- భగ్గుమన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



కాకినాడలో రామోజీరావు దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు శివప్రసన్న తదితరులు

కాకినాడ: తప్పుడు రాతలు, అభూత కల్పనలతో జర్నలిజం విలువలను దిగజారుస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న ఈనాడు పత్రిక అధినేత రామోజీరావు టీడీపీ పట్టాభి కథనం విషయంలో నిజస్వరూపం బయటపెట్టుకున్నారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశీస్సులతో ఎదిగిన చంద్రబాబు, అదే ప్రజలను మోసం చేస్తున్న తీరు అత్యంత దారుణమన్నారు. 'పట్టాభినీ కొట్టారు' శీర్షికన రెండేళ్లనాటి ఫొటోలు వేసి వాస్తవం బయటపడడంతో సవరణ వేసిన ఈనాడు, రామోజీ తీరును నిరసిస్తూ శుక్రవారం ద్వారంపూడి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి త్రిపురసుందరి ఆలయం వరకు రామోజీ దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశాయి. తీవ్ర ఆగ్రహాన్ని ప్రదర్శించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టి, పెట్రోలు పోసి దహనం చేశారు. ఈనాడు డౌన్ డౌన్... రామోజీ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేసిన చంద్రబాబును మించిన అతిపెద్ద దొంగ రామోజీ అని మండిపడ్డారు. హైదరాబాద్ ప్యాలెస్‌లో కూర్చుని తప్పుడు రాతలు రాస్తూ ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చేలా తప్పుడు కథనాలు రాస్తున్నారంటూ ధ్వజమెత్తారు. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ అమరావతిని గ్రాఫిక్స్‌లో చూపించి ప్రజలను తప్పుదారి పట్టించిన ఘనుడు రామోజీ అన్నారు. పట్టాభి విషయంలో సోషల్ మీడియా వాస్తవాలను వెలుగులోకి తేవడంతో లోపలి పేజీల్లో సవరణ వేసి చేతులు దులుపుకొన్నప్పటికీ ప్రజలు వాస్తవాలను గుర్తించారన్నారు. రామోజీ కబడ్దార్ అంటూ పార్టీ కేడర్ నినదించింది. ఈ కార్యక్రమంలో కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, చోడిపల్లి ప్రసాద్, మీసాల ఉదయ్‌కుమార్, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు మార్కెట్ కమిటీ చైర్మన్ బెండా విష్ణుమూర్తి, సూపర్‌బజార్ చైర్మన్ ముమ్మిడి గోవిందు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

జేఎన్‌టీయూకే టీచింగ్ అసోసియేషన్ కార్యవర్గం



నూతన అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాల టీచింగ్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా ప్రొఫెసర్ డాక్టర్ వి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్, కార్యదర్శిగా ఎం.స్వరూపారాణి, సంయుక్త కార్యదర్శిగా శ్యామ్‌కుమార్, కోశాధికారిగా డి.హరిత, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ బి.కృష్ణారావు, ఇ.సునీత, మధుప్రసాద్, డాక్టర్ కె.దుర్గా గంగారావు, మహిళా ప్రతినిధిగా ఝాన్సీరాణి ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత అభినందించారు.

వెనుకబడిన సంక్షేమం

- వసతి గృహాన్ని తనిఖీ చేసిన జిల్లా జడ్జి
- ఉద్యోగులపై అసహనం
- కోర్టుకు రావాలని ఆదేశం



వసతిగృహం పరిసరాలు పరిశీలిస్తున్న మూడో అదనపు జిల్లా జడ్జి కమలాదేవి తదితరులు

కాకినాడ లీగల్: స్థానిక జగన్నాథపురంలోని పాఠశాల, కళాశాల మహిళల బీసీ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులను మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి శుక్రవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. వసతి గృహాల్లో విద్యార్థినులకు, అందుతున్న వసతులు, సదపాయాలను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని సమస్యలు, వసతులను జిల్లా జడ్జికి విద్యార్థులు వివరించారు. వసతిగృహం శ్లాబు పెచ్చులు ఊడి పడుతున్నాయని, లైటింగ్ లేదని, బియ్యం వాసన వస్తున్నాయని, ప్రహరీ సరిగా లేకపోవడంతో తమ పట్ల పలువురు అసభ్యంగా మాట్లాడుతున్నారని వివరించారు. అలాగే మరుగుదొడ్లకు తలుపులు లేవని, చిన్న గదుల్లోనే ఎక్కువ మంది సర్దుకుని గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను సంబంధిత వసతి, కళాశాల వార్డెన్లకు వివరించారా అని న్యాయమూర్తి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దీనికి సంబంధించిన కోర్టు వద్దకు రావాలని ఉద్యోగులకు ఆదేశించారు. కళాశాల వసతి గృహ వార్డెన్ సరస్వతి, పాఠశాల గరల్స్ హాస్టల్ వార్డెన్ ఫ్లోరెన్స్, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసాద్, వన్‌టౌన్ పోలీసు, మండల న్యాయసేవాధికార సంస్థ ఉద్యోగి సంధ్య పాల్గొన్నారు.

జయబాబుకు డాక్టరేట్



బాలాజీచెరువు: ఎలక్ట్రిక్ వాహనాల్లో విద్యుత్ పంపిణీ, నిర్వహణ, అనుసంధానం తదితర అంశాలపై బి.జయబాబు నివేదించిన సిద్ధాంత వ్యాసానికి నిపుణుల బృందం సిఫారసు మేరకు జేఎన్‌టీయూకే ట్రిపుల్ ఈ విభాగంలో శుక్రవారం డాక్టరేట్ ప్రకటించారు. వర్సిటీ డీఏఏ డాక్టర్ సీహెచ్ సాయిబాబు, తమిళనాడు వెల్లూరు విట్ యూనివర్సిటీ ట్రిపుల్ ఈ ప్రొఫెసర్ డాక్టర్ వైపీ ఓబులేసు పర్యవేక్షణలో ఈ సిద్ధాంతాన్ని సమర్పించారు.

నాయీ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలి

బోట్‌క్లబ్: నాయీ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ కేటాయించాలని జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు కింతాడ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో సేవా సంఘం నగర అధ్యక్షుడు భీమనపల్లి వీరబాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ స్వయంవరపు శ్రీనివాసరావు, సంఘ ఉపాధ్యక్షులు గండ్రెడ్డి గోపి, గౌరవ సలహాదారు పి.అప్పారావు పాల్గొన్నారు.

న్యాయవాది హత్యకు నిరసనగా విధుల బహిష్కరణ



బార్ అసోసియేషన్ వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కాకినాడ లీగల్: తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాది నరపాక సురేంద్ర హత్యను కాకినాడ బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ముద్దాయిల తరపున కేసులు వాదించకూడదని న్యాయవాదులు నిరసన తెలిపారు. న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని, దాడులు చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఆల్ ఇండియన్ లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా అధ్యక్షుడు మేడపాటి ధర్మారెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ నరహరిశెట్టి రవికృష్ణ, కాకినాడ ఆంధ్రా లాయర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కేబీ ప్రతాప్‌కుమార్ నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామీణ వైద్యుల సేవలు ఆదర్శనీయం



వైద్య విజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

కాకినాడ కల్చరల్: గ్రామీణ వైద్యుల సేవలు ఆదర్శనీయమని జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక ది యంగ్‌మెన్స్‌హాపీ క్లబ్ దంటు కళాక్షేత్రంలో కమ్యూనిటీ పారామెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ది పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సభ్యులకు శుక్రవారం ఉదయం వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బ్రహ్మారెడ్డి సీజన్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అసోసియేషన్ల నాయకులు చప్పిడి వెంకటేశ్వరావు, గంగుమళ్ల రాంబాబు, బి.శ్రీనివాస్, కేసీ ప్రసాద్, సీహెచ్ ఏడుకొండలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మే నెలాఖరుకు మాస్టర్ ప్రింటర్ సంఘం భవనానికి స్థలం



విజేతలకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

బోట్‌క్లబ్: మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి అవసరమైన స్థలం మే నెలాఖరు నాటికి అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక రోటరీహాల్‌లో శుక్రవారం వరల్డ్ ప్రింటర్స్ డేలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రింటర్ సృష్టికర్త జోహాన్స్ గూటెన్‌బర్గ్ చిత్రపటానికి ఆయనతో పాటు కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోరుమిల్లి బాలప్రసాద్ నివాళి అర్పించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ రూ.15 కోట్లతో కాకినాడలో ఏర్పాటు చేస్తున్న ప్రింటింగ్ క్లస్టర్‌ను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారికి లక్కీడిప్ నిర్వహించిన బహుమతులు బహుమతులు అందించారు. అలాగే క్రికెట్ టోర్నీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం ముఖ్య అతిథులకు జ్ఞాపికలు అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కోరుమిల్లి బాలప్రసాద్, గౌరవ అధ్యక్షులు జీకేడీ శ్రీనివాస్, కార్యదర్శి ప్రకాశరావు, ఉపాధ్యక్షుడు జీవీ రావు, సంయుక్త కార్యదర్శులు శ్రీనివాస్, జానకిరామ్, కోశాధికారి రమణ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం ఆందోళన

కాకినాడ సిటీ: కేంద్ర బడ్జెట్ సంక్షేమ రంగాలకు కోత విధించడం, అదానీ అవినీతి పెద్ద ఎత్తున బయటపడినా ప్రభుత్వ పెద్దలు వంతపాడడం పట్ల సీపీఎం ఆందోళన వ్యక్తం చేసింది. శుక్రవారం కాకినాడ మెయిన్‌రోడ్డులోని హెడ్ పోస్టాఫీసు వద్ద ధర్నా నిర్వహించారు. బడ్జెట్‌లో వ్యవసాయం, ఉపాధి హామీ, స్త్రీ శిశుసంక్షేమం, ఆహారభద్రత, ఎస్సీ, ఎస్టీ సంక్షేమం వంటి రంగాలకు భారీ కోత విధించడం దారుణమన్నారు. అదానీ అవినీతి కుంభకోణాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలన్నారు. పార్టీ నాయకులు ఎం.రాజశేఖర్, దువ్వా శేషుబాబ్జీ, పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వేళంగిలో ఉచిత కంటి వైద్యశిబిరం



వేళంగిలో కంటిపరీక్షలు చేస్తున్న వైద్యులు

కరప: మండలం వేళంగిలోని శ్రీనివాస నర్సింగ్ హోమ్ ఆవరణలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గౌతమి నేత్రాలయం(రాజమహేంద్రవరం) సౌజన్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ బొడ్డు భాస్కరరామస్ ప్రారంభించగా వేళంగి పరిసర గ్రామాల నుంచి 300 మంది రోగులు రాగా, గౌతమి నేత్రాలయ వైద్యులు కంటిపరీక్షలు నిర్వహించారు. 50 మందికి కేటరాక్ట్ ఆపరేషన్లు చేయాల్సి ఉందని గుర్తించారు. మిగిలిన వారికి మందులు, కళ్లజోళ్లు రాసి ఇచ్చారు. క్లబ్ కార్యదర్శి చుండ్రు శ్రీధర్, కోశాధికారి ఇళ్ల ఆదేశ్ తదితరులు పాల్గొన్నారు.

గోమాతల కోసం మందుల వితరణ

- రూ.30 వేల విలువైన మందులు అందజేసిన జైన్ల సంఘం



ఇన్‌చార్జి కమిషనర్ నాగనరసింహారావుకు మందులను అందజేస్తున్న జైన్ల సంఘం ప్రతినిధులు

కాకినాడ: లంపీ స్కిన్ బారిన పడ్డ గోమాతలను ఆదుకునేందుకు జైన్ల సంఘం రూ.30 వేల విలువైన మందులను సమకూర్చి శుక్రవారం కాకినాడ నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావుకు ఆయన కార్యాలయంలో అందజేశారు. గతంలోనూ రూ.30 వేల విలువైన మందులు అందజేసిన సంఘానికి ఇన్‌చార్జి కమిషనర్ అభినందనలు తెలిపారు. నగరంలోని పలు గోవులు ఈ వ్యాధి బారిన పడ్డ విషయం తెలుసుకున్న వెంటనే ప్రజారోగ్య విభాగం సమన్వయంతో పశు సంవర్ధక శాఖ దృష్టికి కూడా తీసుకువెళ్లి అవసరమైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కొంతమంది సచివాలయ కార్యదర్శులు కూడా సుమారు రూ.50 వేలు సమకూర్చి అందజేశారని చెప్పారు.

పద్మశాలీ సంఘం సీడబ్ల్యూసీ సభ్యుడిగా సత్యనారాయణ

కాకినాడ: అఖిల భారత పద్మశాలీ సంఘ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యునిగా కాకినాడకు చెందిన పొన్నగంటి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ అఖిల భారత అధ్యక్షుడు కందగట్ల స్వామి నియామక ఉత్తర్వులు పంపారని కోస్తా ఆంధ్రా సంఘ అధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పొన్నగంటి సత్యనారాయణ మాట్లాడుతూ పద్మశాలీల సమస్యల పరిష్కారానికి, అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

రీ సర్వే వేగవంతం చేయండి

- ఇన్‌చార్జి కమిషనర్ నాగ నరసింహారావు
- వివిధ కార్యదర్శులకు దిశానిర్దేశం



కాకినాడ: భూముల రీ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు కోరారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో శుక్రవారం అడ్మిన్ కార్యదర్శులు, ప్లానింగ్ కార్యదర్శులు, రెవెన్యూ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సీడీఎంఏ నుంచి 16ఏ ఫార్మేట్‌లో వచ్చిన ఆదేశాల ప్రకారం ఆయా అసెస్‌మెంట్ నెంబర్లు, ఇతర సమాచారాన్ని సర్వే నెంబర్‌కు అనుసంధానం చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని సూచించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఆయా సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎఫ్ఏసీ కమిషనర్‌గా ఏడీసీ

కాకినాడ నగరపాలక సంస్థ ఎఫ్ఏసీ కమిషనర్‌గా సీహెచ్ నాగనరసింహారావు నియమితులయ్యారు. ఈ మేరకు పురపరిపాలనాశాఖ కమిషనర్, డైరెక్టర్ నుంచి శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కమిషనర్ కె.రమేష్ వచ్చే నెల 8వ తేదీ వరకు సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఏడీసీకి పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సమాజ చరిత్రకు ప్రతిబింబం సాహిత్యం

- నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ అశోక్
- వలసవాదానంతర సాహిత్యంపై ఏఎస్‌డీలో జాతీయ సదస్సు

కాకినాడ సిటీ: జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో వలస వాదానంతర భారత సాహిత్య పాత్రలపై రెండు రోజుల జాతీయ సదస్సును నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ టి.అశోక్ ప్రారంభించారు. సమాజంలోని వివిధ అంశాలను సాహిత్యం ప్రతిబింబిస్తుందని, దాని ద్వారా సమాజ చరిత్రను తెలుసుకోవచ్చన్నారు. సాహిత్యంలోని పాత్రలు, కల్పితమైన కథాంశాలు, సామాజిక అంశాలు, సమకాలీన సమాజాన్ని అనుసరిస్తూనే ఉంటాయని అశోక్ అన్నారు. ఆంగ్ల సాహిత్యంలో వలస వాదానంతరం వెలువడిన కథలు, నవలలు మొదలైనవి మానవీయతను వెలికితీస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ వి అనంతలక్ష్మి కళాశాల ప్రగతిని వివరించారు. ఈ జాతీయ సదస్సు తమ కళాశాలలో నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ విశ్రాంత ఆచార్యుడు టి.విశ్వనాథరావు మాట్లాడుతూ వలస వాదానంతరం సాహిత్యం–సమాజంపై వలస పాలనకు ముందున్న సంస్కృతిని, సాహిత్యాన్ని వివరించారు. సదస్సు కన్వీనర్ పి.సంజోత, వివిధ శాఖల అధ్యాపకులు పి.విశ్వనాథరావు, టీకేవీ శ్రీనివాసరావు, సువర్చల, పి.శాంతి, వై.స్వర్ణశ్రీ, ఎం.వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాణకవి గ్రంథావిష్కరణ



బాణకవి పుస్తకావిష్కరణలో కుటుంబ సభ్యులు, అతిథులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట శ్రీ కన్వెన్షన్‌లో బాణకవి పుస్తకావిష్కరణ శుక్రవారం నిర్వహించారు. 1958లో తట్టా రంగరామానుజాచార్యులు బాణకవి చరిత్రను గ్రంథంగా రచించి, ప్రచురింపజేశారు. రంగరామానుజాచార్యులు శత జయంతిని పురస్కరించుకుని కుటుంబ సభ్యులు ఈ గ్రంథాన్ని పునర్ముద్రించారు. పుస్తకావిష్కరణ సభకు డాక్టర్ పుట్టా లక్ష్మీ నరసింహాచార్యులు అధ్యక్షత వహించగా గుదిమెళ్ల లక్ష్మీ నరసింహాచార్యులు ముఖ్యఅతిథిగా పాల్గొని రంగరామానుజాచార్యులు బహుముఖ ప్రజ్ఞను కొనియాడారు. గ్రంథకర్త కుమారులు నలుగురు, కుమార్తెలు ఇద్దరు, మనుమలు 16మంది పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో 'నెట్‌వర్క్' చిత్రీకరణ

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో ఓ వెబ్ సిరీస్ చిత్రీకరణ జరుగుతోంది. హైదరాబాద్‌కు చెందిన రమ్య సినిమా బ్యానర్‌పై ఈ చిత్రం తెరకెక్కుతోంది. నాలుగు కథల అనుసంధానంతో థ్రిల్లర్ బ్యాక్ డ్రాప్‌లో ఎనిమిది ఎపిసోడ్‌లతో నిర్మితమవుతున్న ఈ చిత్రానికి కథ ఆధారంగా 'నెట్‌వర్క్' అనే పేరును ఖరారు చేశారు. లావణ్య నిర్మాతగా, సతీష్‌చంద్ర దర్శకుడిగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరోగా శ్రీనివాస్ సాయి, హీరోయిన్‌గా ప్రియ నటిస్తుండగా ప్రొడక్షన్ మేనేజర్‌గా సూర్య వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది మే నెలలో ఓటీటీ వేదికగా ఈ సిరీస్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మరో మూడు రోజుల పాటు ఈ చిత్రం కాకినాడ జీజీహెచ్‌లో షూటింగ్ జరుపుకోనుంది. బాధ్యతలు, ఆర్థిక అవసరాల నడుమ చిక్కుకున్న హీరో ఇష్టం లేకపోయినా వార్డు బోయ్‌గా పనిచేస్తూ ఉండగా, ఎదురయ్యే పరిణామాలు, విధి నిర్వహణలో పడే ఇబ్బందులను ఆసక్తిగా తెరకెక్కిస్తున్నారు.

పేపకాయలపాలెంలో డెంగీ కేసు నమోదు

- అప్రమత్తమైన పంచాయతీ, వైద్యాధికారులు



డెంగీ కేసు నమోదైన ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న వైద్య, పంచాయతీ సిబ్బంది

కరప: గ్రామశివారు పేపకాయలపాలెంలో డెంగీ కేసు నమోదు కావడంతో గ్రామ పంచాయతీ, వైద్య సిబ్బంది అప్రమత్తమై చర్యలు చేపట్టారు. గ్రామ వలంటీర్ జ్వరంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ కోలుకుంటోంది. వైద్య పరీక్షల్లో డెంగీగా గుర్తించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి వి.సునీల్‌కుమార్, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, లోహిదాస్‌కుమార్ స్పందించి నాలుగు రోజుల క్రితం ఆ గ్రామంలో సిబ్బందితో పారిశుధ్య పనులు చేపట్టి, దోమల నివారణ మందులు పిచికారీ చేయించారు. శుక్రవారం కరప పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.శ్రీనివాస్‌నాయక్, ఉపసర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు సాదే లోహిదాస్‌కుమార్ తదితరులు ఇంటింటా సర్వే నిర్వహించి, ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే వెంటనే పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకుని, వైద్య సలహాలు పాటించాలన్నారు. దోమలనివారణకు ఎబేట్ పిచికారీ చేయించారు.

27, 28 తేదీల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కాకినాడ: ఈ నెల 27, 28 తేదీల్లో నగరంలోని 10 ప్రాంతాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు కార్పొరేషన్ కమిషనర్ (ఎఫ్ఏసీ) సీహెచ్ నాగ నరసింహారావు తెలిపారు. ఆధార్‌లోని డాక్యుమెంట్ అప్డేట్, మార్పులు, చేర్పుల కోసం సోమవారం, మంగళవారాల్లో ఈ ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయన్నారు. జిల్లాల పునర్విభజన తరువాత ప్రజలందరూ తమ ఆధార్‌లో ఉన్న ఈస్ట్ గోదావరి అని ఉన్న జిల్లాను కాకినాడ జిల్లాగా తప్పనిసరిగా మార్పుకునేందుకు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిజేశారు. కాకినాడ అర్బన్‌లో కృష్ణనగర్- 2ఏ, డైరీ ఫారం-11ఏ, గోలీలపేట-14ఏ, యానాంరోడ్డు-15ఏ, చిన్నమార్కెట్-21ఏ, యాళ్లవారి స్ట్రీట్- 28బి, జగన్నాయక్‌పూర్-30 బి, బ్యాంక్‌పేట-32ఏ, గాంధీనగర్ -38ఏ, గైగోలుపాడు-50బి సచివాలయాలలో ఆధార్ శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఆయా సేవలకు నిర్ణీత సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ స్పష్టం చేశారు.